కాపునేస్తం మెగా చెక్కును అందజేస్తున్న అధికారులు

6961 మందికి కాపునేస్తం

రూ.10.441 కోట్లు లబ్ధి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లా వ్యాప్తంగా కాపు నేస్తం కింద అర్హులైన 6961 మంది లబ్ధిదారులకు రూ.10.441 కోట్లు మంజూరు అయింది. నాలుగవ విడత కాపునేస్తం సాయాన్ని తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి లబ్ధిదారులకు నేరుగా జమ చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అగ్రిగోల్డ్ సలహా మండలి జిల్లా ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపు, తెలగ, బలిజ, ఒంటరి మహిళలకు ముఖ్యమంత్రి భరోసా కల్పిస్తున్నారన్నారు. వరుసగా నాలుగవసారి నిధులు విడుదల చేయడం సంతోషకరమన్నారు. జిల్లాలో 45 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన అర్హులందరికీ ఆర్థిక భరోసా కల్పించారన్నారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, గోరంట్ల ఎంపిపి ప్రమీలమ్మ, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ తిప్పన్న, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, బీసీ కార్పొరేషన్ ఎఇఒ విజయలక్ష్మి, పాల్గొన్నారు.

దా'రుణ'మోసంపై ఫిర్యాదు



అప్పుల వల నుంచి కాపాడాలంటూ వేడుకోలు

పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అప్పుల వల నుంచి కాపాడండని బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. అమాయక పేదలను వలపన్నీ అప్పుల ఊబిలోకి ట్రాక్టర్ షో రూమ్ యాజమానులు, ఫైనాన్స్ సిబ్బంది దింపారు. ఒక సంస్థకు సంబంధించి 30 మంది అమాయక నిరుపేదలు ఈ అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఈ 'రుణ'మోసం నుంచి బయటపడేయాలని పోలీసులను రెండు రోజులుగా ఆశ్రయిస్తున్నారు. అయితే పోలీసుల నుంచి దీనిపై స్పందన అంతంత మాత్రంగానే ఉండటం గమనార్హం.

'ప్రజాశక్తి' కథనంపై కదలిక

'పేదలపై అప్పుల వల' అన్న కథనం ప్రజాశక్తి పత్రికలో ఈ నెల 8వ తేదీన ప్రచురితం అయ్యింది. దీనిపై ఫైనాన్స్ సంస్థ, నిఘా వర్గాలు సైతం దృష్టి సారించాయి. అంతర్గత విచారణ చేపట్టాయి. ఈ విచారణలోనూ అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నట్టు సమాచారం. ఫైనాన్స్ సంస్థ, షోరూమ్ సిబ్బంది కలసి పక్కా ప్రణాళికతో మోసం చేశారన్నది వారి విచారణలో తేలినట్టు తెలుస్తోంది. అత్యంత పేదలు, నిరక్షరాస్యులను గుర్తించి, వారి అమయకత్వాన్ని ఆసరగా చేసుకుని ఈ ప్రణాళిక రచించారు. వారికి కొంత మెత్తాన్ని ముట్టజెప్పి సంతకాలు తీసుకున్నారు. ఆ తరువాత ఈ వాహనాలను వారిపైనున్న రుణాన్ని చెల్లించలేరంటూ వెనక్కు తీసుకుని ఇతర రాష్ట్రాలకు నేరుగా విక్రయించారు.

ఒక్కో ట్రాక్టరను నాలుగు లక్షల రూపాయలకు ఇతర రాష్ట్రాలకు విక్రయించినట్టు సమాచారం. ఈ రకంగా 30 మందికి కలిపి రూ.2.50 కోట్ల వరకు రుణమిచ్చారు. ఆ తరువాత ఈ వాహనాలను ఒక్కోటి నాలుగు లక్షల రూపాయల చొప్పున అమ్మి రూ.1.20 కోట్లు సొమ్ము చేసుకున్నారు. ఈ వాహనాలపై తీసుకున్న అప్పు మాత్రం ఆ పేదలపై అలాగే ఉండిపోయింది. దీంతో దీన్ని చెల్లించాలని ఆ సంస్థ ఒత్తిడి తెస్తోంది. దీంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో బాధితులున్నారు. తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేయడానికి పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. 12 మంది బాధితులు ముందుకొచ్చి శుక్రవారం నాడు పోలీసులను ఆశ్రయించే ప్రయత్నం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్ వద్ద పడిగాపులు కాచినా వారి నుంచి స్పందన లేకపోవడంతో మౌనంగా వెనుదిరిగారు.

సబ్సిడీ రణాల్లోనూ ఇదే తరహా మోసం

బలహీనవర్గాలకు ఇచ్చే సబ్సిడీ రుణాల్లోనూ కొంత మంది ఇదే తరహాలో అమాయకులను మోసం చేసినట్టు ఆరోపణలున్నాయి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన రుణాలను ఎస్సీలపై తీసుకుని పెత్తందారుల వద్ద ఉంచుకున్నట్టు తెలుస్తోంది. ఇతర సంస్థల్లోనూ ఇదే తరహా మోసాలతో అమాయకులైన పేదలపై అప్పుల ఊబిలోకి నెట్టేశారు. స్థానికంగానున్న కొంత మంది దళారులు, షోరూమ్ సిబ్బంది కలసి పక్కా ప్రణాళికతో ఈర కమైన మోసాలకు పాల్పడినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడితే మరింత మంది బాధితులు ముందుకొచ్చే అవకాశాలున్నాయి.

సాగుదారులపై వివక్ష తగదు

భూ పంపిణీలో సాగుపట్టాలు ఇవ్వాలి

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న

ప్రజాశక్తి-సోమందేపల్లి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం నాయకులు

ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పేద రైతులకు పట్టాలు ఇవ్వకుండా వారిపై వివక్ష చూపడం తగదని, ప్రస్తుత భూ పంపిణీలో సాగుదారులు అందరికీ పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నాడు తహశీల్దార్ సురేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమందేపల్లి గ్రామానికి చెందిన దళిత, బలహీన వర్గాల భూమిలేని నిరుపేదలు వందమంది పందిపర్తి పొలం సర్వే నంబర్ 384లో అసైన్మెంట్ మిగులు భూమిని సాగు చేస్తున్నారని చెప్పారు. సంవత్సరాల తరబడి కొండ భూములను సాగు భూములుగా మార్చుకుని సాగులో ఉన్నారన్నారు. ఇందులో కోసం లక్షలాది రూపాయలు ఖర్చుచేశారన్నారు. సాగుపట్టాలు ఇవ్వాలని వీరు అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేదన్నారు. ప్రస్తుత భూ పంపిణీలో అయినా పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకుండా అర్హులైన పేద రైతులకు న్యాయం చేయాలన్నారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ సాగుదారుల వివరాలను ఉన్నతాధికారులకు పంపి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రంగప్ప, నాగభూషణ, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బెస్త కిష్టప్ప, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు కుమ్మర కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసిపిలోకి కృష్ణాపురం జమీర్

కృష్ణాపురం జమీర్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని 10వ వార్డుకు చెందిన టిడిపి ఇన్‌ఛార్జి కృష్ణాపురం జమీర్ ఆదివారం వైసిపిలో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు. కృష్ణాపురం జమీర్, కుటుంబ సభ్యులు, మిత్రులు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరనున్నారు. కళాజ్యోతి సర్కిల్ దగ్గర నుంచి ర్యాలీగా వెళ్లి, జామియా మజీద్ దగ్గర ఏర్పాటు చేసిన సభలో వైసిపిలో పార్టీలో చేరుతున్నట్లు జమీర్ తెలిపారు.

అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌టిఎస్‌ఎన్ డిగ్రీ కళాశాలలో అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్ రాష్ట్ర ఛాంపియనషిప్ పోటీలు శనివారం ప్రారంభం అయ్యాయి. జిల్లా ఫుట్‌బాల్ వైస్ ప్రెసిడెంట్ ఇర్షాద్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్మిత వీటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి, కడప, కర్నూల్, అనంతపురం, నంద్యాల జిల్లాల నుంచి సీనియర్ మెన్ ఫుట్‌బాల్ జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌జిఎఫ్‌ఐ సెక్రటరీ సుగుణమ్మ, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ స్మితలు పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కాగా ఈ పోటీల్లో గెలుపొందిన జట్టు రాష్ట్రస్థాయిలో జరగబోయే స్టేట్‌ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధిస్తుంది. ఈ కార్యక్రమంలో నరసింహ ఆచారి, కరాటే మాస్టర్‌లు శాకీర్, అక్బర్ ఆలీ, షెక్షా పాల్గొన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మండల పరిధిలోని సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీవో సౌజన్యకుమారి తెలిపారు. శనివారం మండల పరిధిలోని తుమ్మల, గొట్లూరు-1, గొట్లూరు-2, సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ఏ విధంగా అమలు చేస్తున్నారు.. ప్రజలకు ఎలా అందిస్తున్నారన్న దానిపై పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

సమన్వయంతో ముందుకెళ్తేనే అభివృద్ధి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకెళ్తేనే పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. శనివారం నాడు కమిషనర్ ఛాంబర్‌లో విభాగాల అధికారులతో వివిధ అభివృద్ధి పనులు, పురపాలక సంఘం ఆదాయం పెంచుకోవడానికి అవసనమైన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయ భవనంలో ఉన్నా అన్ని గదులు వినియోగంలోకి తీసుకు రావాడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈ వెంకటరమణ, డిఈఈ బాల సుబ్రమణ్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

జగన్న సురక్షపై విస్తృత ప్రచారం

పురపాలక సంఘం వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు, వార్డు వాలంటీర్లు ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్షపై విస్తృత ప్రచారం నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. శనివారం 36వ వార్డు పరదిలోని ముదిరెడ్డిపల్లిలో వైద్యులతో కలిసి కమిషనర్ ఈ కార్యక్రమాన్ని పరిశీలన చేశారు.

విభాగాల అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

పెనుకొండలో బికె ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ..

కొత్తచెరువలో పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో..

హిందూపురంలో...

రాజకీయ కక్షతోనే చంద్రబాబు అరెస్టు

◆ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలు ◆ కొవ్వొత్తుల ర్యాలీ

రాజకీయ కక్షతోనే చంద్రబాబు నాయుడును వైసిపి ప్రభుత్వం అరెస్టు చేసిందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. రిలేదీక్షలు, కొవ్వొత్తుల ర్యాలీలతో నిరసన తెలిపారు. పలు ప్రాంతాల్లో కొవ్వొత్తుల ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు.

పెనుకొండ : టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి ఆధ్వర్యంలో రాత్రి స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించగా సిఐ కరుణాకర్, ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు ర్యాలీని అడ్డుకొని నాయకు లు, కార్యకర్తలను బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్న వెంకటరాముడు, జివిపి నాయుడు, రొద్దం నరసింహులు, చిన్నప్పయ్య, రఘువీరాచౌదరి, నాగరాజు, రామలింగ, మహిళా నాయకులు సుబ్బరత్నమ్మ, లీలావతి, అనసూయమ్మ, బేబీ, రత్నమ్మ, గాయత్రి, షౌకత్, ఆంజనేయులు, చంద్ర, నరసింహులు, అజ్మతుల్లా, గిరిధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : సైకో సిఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో సాగనంపాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బుక్కపట్నం రోడ్డు మీదుగా వాల్మీకి విగ్రహం, నాలుగు రోడ్ల కూడలి వరకూ కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు.

కదిరి టౌన్ : కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని మదనపల్లి రోడ్డు పెట్రోల్ బంకు వద్ద కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అంతకుముందు కాగడాల ప్రదర్శనకు వెళ్తున్న కందికుంటను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కందికుంట, టిడిపి శ్రేణులు కదిరి-హిందూపురం రహదారిపై బైఠాయించారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ బాబు, పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, కష్ణమోహన్ నాయుడు, బంగారు కష్ణమూర్తి, బండారు మనోహర్ నాయుడు, గంగయ్య నాయుడు, కౌన్సిలర్లు, ఆల్ఫా ముస్తఫా, మహిళా నాయకురాలు, పర్వీన్ భాను, పీట్ల రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో ఉద్రిక్తత నడుమ కాగడాల ప్రదర్శన

హిందూపురం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో శనివారం రాత్రి చేపట్టిన కాగడాల ప్రదర్శన తీవ్ర ఉద్రిక్తతల నడుమ సాగింది. పోలీసులు ర్యాలీని అడ్డుకోవడంతో పాటు కొందరు నాయకులను ఇళ్ల వద్దకు వెళ్లి ముందస్తు అరెస్టు చేశారు. అయినప్పటికీ టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున మెయిన్ బజార్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో నాయకులను అదుపులోకి తీసుకునే క్రమంలో అగ్గి రవ్వలు పోలీసులు, కార్యకర్తల మీద పడి స్వల్ప గాయాలయ్యాయి. అంబేద్కర్ కూడలిలో పోలీసులు, టిడిపి కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. చివరికి పోలీసులు టిడిపి నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్ర నాయకులు అంజనప్ప, రామాంజనమ్మ, ఆర్ఎంఎస్ షఫివుల్లా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం శాంతి యుతంగా ఆందోళన చేసుకునే హక్కును సైతం కాలరాస్తుందన్నారు. వెంటనే చంద్రబాబును విడుదల చేయకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామన్నారు.

ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్‌గా కార్తీక్

ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కార్తీక్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ పెనుగొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఈ మేరకు కలెక్టరేట్‌లో కార్తీక్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ వ్యక్తిగత కారణాలవల్ల ఈనెల 15 నుంచి అక్టోబర్ 23 వరకు సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో పెనుకొండ సబ్ కలెక్టర్‌గా పని చేస్తున్న కార్తీక్ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని ఏవో వెంకటనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ డే

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యుత్ శాఖ డిఇ మోజస్, కొమ్ము భాస్కర్‌ను సత్కరిస్తున్న ఇంజినీర్లు

మోక్షగుండం విశ్వేశ్వ రయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీరింగ్ డేను శనివారం నాడు పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ నేటి ఆధునిక టెక్నాలజీ అభివృద్ధి చెందిదంటే అందుకు మూలపురుషుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అన్నారు. ఆధునిక భారతావనిలో ఇంజినీరింగ్‌కు పునాదులు వేసిన మహామేధావి అన్నారు. అనంతరం పట్టణానికి చెందిన ఇంజినీర్లు అందరూ ఎస్కేయూ పాలక మండలి సభ్యులుగా ఎంపికైనా కొమ్ము భాస్కర్, ఎలక్ట్రికల్ డీఈ మోసెస్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్టీ డిఈ విజయ్ కుమార్, ఆర్అండ్‌బి డిఈ శైలజ, ఇరిగేషన్ డిఈ బయప్ప, ఎలక్ట్రికల్ షాజహాన్, ఏఈలు చిన్నికృష్ణ, సాలేహ, రవి, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

హిందూపురంలో చెత్త సేకరణ వాహనాలతో నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు

పురంలో 'క్లాప్' సైరన్..!

◆ సమస్యలపై కార్మికుల నిరసన ◆ 5 నెలలుగా సిబ్బందికి అందని వేతనాలు..

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో ఇంటింటి చెత్త సేకరణ ఆటోల సైరన్ మారుమోగింది. గత 5 నెలల నుంచి ఏజెన్సీ నిర్వహకులు క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతనాలు ఇవ్వలేదు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా డ్రైవర్లకు న్యాయం జరగలేదు. దీంతో చెత్త సేకరణను ఆపి ఆటోలతో డ్రైవర్లు పట్టణంలో సైరన్ వేసుకుని శనివారం నాడు నిరసన ర్యాలీ చేపట్టారు. వేతనాలు చెల్లింపు, మరమ్మతులు, పెట్రోల్ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఆటో డ్రైవర్లు, సిబ్బంది పట్టణంలో వాహనాల్లో సైరన్ వేసుకుని పురపాలక సంఘం కార్యాలయం నుంచి రహమత్ పురం సర్కిల్, బైపాస్ రోడ్డు, గురునాథ్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మిదుగా తిరిగి అంబేద్కర్ సర్కిల్ వద్ద వాహనాలను నిలిపి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి అనిల్ కుమార్, నరసింహులు మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన సమయంలో ప్రతి నెలా వేతనాలు ఇస్తామని ఏజెన్సీ నిర్వహకులు చెప్పారన్నారు. ప్రస్తుతం 5 నెలలు వేతనాలు ఇవ్వడం లేదనన్నారు. బండ్లకు పెట్రోల్ కూడా వేయించడం లేదన్నారు. వాహనాలు మరమ్మతుకు గురైతే పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు ఇవ్వకుంటే పూర్తి స్థాయిలో సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. క్లాప్ డ్రైవర్ల సమస్యలపై మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ స్పందించారు. ఏజెన్సీ నిర్వహకులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం

మట్టి గణపతులతో వైద్యులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

హిందూపురం : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించి పూజించాలని వైద్యులు సౌధీన్‌రెడ్డి, పాంచజన్య పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. శనివారం పాఠశాలలో మందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసినా విగ్రహాలు పర్యావరణానికి ఎంతో నష్టం అన్నారు. వీటిని ఎవరూ వినియోగించరాదన్నారు. అనంతరం వైద్యులు, విద్యార్థుల తల్లిదండ్రులకు మట్టి వినాయకులను పాఠశాల యాజమాన్యం పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నంద కుమార్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ స్మిత, హెచ్‌ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, సుపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎంలు శశికళ, షేక్ అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ధర్మవరంలో విశ్వ భారతి స్కూల్‌లో..

ధర్మవరం టౌన్ : ఈనెల 18వ తేదీన జరుపుకునే వినాయక చవతి పండుగను మట్టితో చేసిన వినాయకునికే పూజలు నిర్వహించి పర్యావరణాన్ని కాపాడాలని విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఛైర్మన్ రిజ్వాన్ బాషా సూచించారు. శనివారం పాఠశాలలో మట్టి వినాయక తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణ, కరస్పాండెంట్ షేక్ సేకున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

పుట్టపర్తి రూరల్ : పోలీసు అధికారులుగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజలు, ప్రభుత్వానికి వారధులుగా నిలవాలని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి సూచించారు. పుట్టపర్తి అర్బన్ నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన టివి.కొండారెడ్డి, శనివారం ఎస్పీ ఛాంబర్లో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. జమ్మలమడుగు రూరల్ సిఐగా పనిచేస్తున్న కొండారెడ్డి సిఐల బదిలీల్లో భాగంగా పుట్టపర్తి అర్బన్ సిఐగా బదిలీ అయ్యారు.

ప్రవర్తన మార్చుకుని మెలగాలి

న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

సబ్ జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

సబ్ జైల్లో ఉన్న ఖైదీలు, నిందితులు బయటకు వెళ్లిన తర్వాత వారి ప్రవర్తన మార్చుకుని మెలగాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక సబ్ జైలును ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో ఏఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఎప్పటినుండి ఉన్నారు, న్యాయవాదులు ఉన్నారా లేదా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీల కోసం ఆహార పదార్థాలు వండేందుకు నిలువ ఉంచిన నిత్యావసర సరుకులను, కూరగాయలను పరిశీలించి, ఖైదీల జైలు గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైదీలకు నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారి అంజి నాయక్, లోక్ అదాలత్ శారద పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పీడీ రామాంజినేయులు శనివారం పరిశీలించారు. చోళసముద్రం గ్రామంలో వర్షం నీటిని నిల్వ చేసుకునే విధంగా తవ్విన గుంతలను పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను మరింత పెంచాలన్నారు. నిబంధనల మేరకు ఉపాధి పనులను చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహ నాయుడు, ఏపీడీ శివనందనాయక్, ఏపీవో జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన

రిలే నిరాహార దీక్షల్లో టిడిపి ప్రముఖులు


తాడిమర్రిలోదీక్షలో పాల్గొన్న పరిటాలశ్రీరామ్

ప్రజాశక్తి-పరిగి

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు కేవలం కక్ష సాధింపు చర్య అని పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక పాత పోస్టాఫీస్ సమీపంలో శనివారం టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు, లోకేష్‌లకు లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక సిఎం జగన్ కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వైసిపికి 2024లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. దీక్షలో నాయకులు లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, రొద్దం నరసింహులు, చిన్నప్పయ్య, చౌడప్ప, అన్నమయ్య, డిఎస్ఎల్ శ్రీనివాసులు, పలువురు పాల్గొన్నారు.

మూల్యం తప్పదు : మాజీ మంత్రి పల్లె

కొత్తచెరువు : చంద్రబాబుని ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపిందని, ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సాయంత్రం నల్ల బ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పల్లె మాట్లాడుతూ చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చేంత వరకూ ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, నాయకులు ఎస్.వెంకటరమణ, అప్ప జయప్రకాష్, నాగేంద్ర ప్రసాద్, గాజుల చంద్రమోహన్, బోయ రాజు, సుధాకర్, సైకిల్ షాప్ బాబా షర్ఫుద్దీన్, శివప్రసాద్, కిరణ్, రాహుల్, వైవి.మురళి, ఐస్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుక్కపట్నంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షతో చంద్రబాబుపై తప్పుడు కేసులు బనాయించిన సిఎం జగన్, సహకరించిన అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకొచ్చి ప్రజాక్షేత్రంలో విజేతగా నిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, యశోద రాయుడు, లావణ్యగౌడ్, వెంకటరాముడు, సుబ్బారెడ్డి, బాలు, సయ్యద్ బాషా, మీసాల మురళి, శ్రీరాములు, జయరాం, వాజిద్, గొర్ల కృష్ణ, వైవి మురళి, మంజునాథ్, అక్కులప్ప, తదితరులు పాల్గొన్నారు.

తప్పులను కప్పిపుచ్చుకునేందుకే : కందికుంట

గాండ్లపెంట : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక బస్‌స్టాప్ వద్ద కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టగా చుట్టుపక్కల గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కందికుంట మాట్లాడుతూ జగన్ చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసమే చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించిందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో వారే బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, సర్పంచులు శివప్పనాయుడు, అనసూయమ్మ, మాజీ సర్పంచ్ ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిట్లర్‌ను మించిన నిరంకుశ పాలన

హిందూపురం: చంద్రబాబుకు బెయిల్ వచ్చే వరకు తమ ఉద్యమాలు కొనసాగుతాయని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ టిడిపి నాయకులు సిసి వెంకట్రాముడు తెలిపారు. శనివారం పట్టణంలోని ఇందిరమ్మ సర్కిల్‌లో టిడిపి నాయకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిసి వెంకట్రాముడు, అంబికా లక్ష్మీనారాయణ, శ్రీనివాస రావు, అంజినప్ప మాట్లాడుతూ చంద్రబాబును కక్షతోనే జైలుకు పంపించారని ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. జగన్ పాలన హిట్లర్, ముషారఫ్, తాలిబన్లను మించిపోయిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రమేష్ కుమార్, గంగాధర్, చిన్నా రెడ్డి, రామాంజినమ్మ, జెపికె రాము, నెట్టప్ప, పరిమళ, రాము, దాదు, హిదయతుల్లా, కౌన్సిలర్లు, నాయకులు ఆశ్వర్థ రెడ్డి, అరుణచల రెడ్డి, ఆనంద్, మలగూరు రషీద్ పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిరసనగా ఐటిడిపి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్లో బాబుతోనేను అనే ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ బోర్డుపై ప్రజలతో సంతకాలను చేయించారు.

తనకల్లు : టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహారదీక్షలకు ముఖ్యఅతిథిగా కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం నిజాయితీగా పాటుపడిన చంద్రబాబుని అరెస్టు చేయడం క్షమించరాని నేరమన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా కర్నాటక, తమిళనాడుతో పాటు ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారందరూ చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఉద్యమాలు చేస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులను విరమించుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యకర్తలకు అండగా ఉంటానని భయపడాల్సిన అవసరం లేదని హెచ్చరించారు.

రాక్షస పాలనకు నిదర్శనం

చిలమత్తూరు : చంద్రబాబుకి లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక రాజకీయకక్షతో అక్రమంగా కేసులు పెట్టి అప్రజాస్వామికంగా అరెస్టు చేయడం రాక్షస పాలనకు నిదర్శనమని అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి అంజనప్ప పేర్కొన్నారు. బాబు అరెస్టుకు నిరసనగా చిలుమత్తూరులో చేపట్టిన రిలే నిరహారదీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సుపరిపాలన సాగాలంటే టిడిపి గెలుపు చాలా అవసరం అన్నారు. చంద్రబాబు బయటికి వచ్చేంత వరకూ పోరాటం ఉధృతం చేస్తామన్నారు. దీక్షలో హిందూపురం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు రాష్ట్ర కార్యదర్శి రామాంజినమ్మ, పార్లమెంటు ఉపాధ్యక్షురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమని పెద్దరాసు సుబ్రమణ్యం పేర్కొన్నారు. మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ జీవి తంలో ఎటువంటి అవినీతి మచ్చలేని చంద్రబాబుని వైసిపి ప్రభుత్వం కేసుల్లో ఇరికించేందుకు కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రెండేళ్ల క్రితమే హైకోర్టులో వాదోపవాదాలు ముగిశాయ ని, అప్పుడు లేని చంద్రబాబు పేరు ఇప్పుడు ఎలా పుట్టుకొచ్చిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో అల్లబకష్, ఇస్మా యిల్, లక్ష్మీప తినాయుడు, అబ్దుల్ రవూఫ్, రఘురామరెడ్డి, శ్రీనివాసులు, ఈశ్వర, అశోక్, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో తాడిమర్రి మండలంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ముదిగుబ్బ మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు తాడిమర్రి వెళ్లి దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంకేపల్లి ప్రతాప్, చంద్ర, అబ్దుల్లా, రామాంజి, భానుచంద్ర, దేవా, టి.ప్రతాప్, పాల్గొన్నారు.

గుడిబండ : చంద్రబాబు జైలు నుంచి త్వరగా విడుదల కావాలని టిడిపి నాయకులు ఆకాంక్షించారు. మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కన్వీనర్ మదనకుంటప్ప, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్ మంజునాథ్, సన్నమారెప్ప, క్రిష్ణప్ప, నాయకులు వీరకేతప్ప హనుమంతరా యప్ప, ఈశ్వరప్ప, శివశంకర్, బుడేన్, గోవిందరాజులు, సిద్ధప్ప, అనంతరాజు, శ్రీనివాసులు, ఉమేష్, రామాంజనేయులు, నరసింహమూర్తి, ధనుంజయ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కపట్నంలో తెలుగుతమ్ముళ్లతో పల్లె

గోరంట్ల : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పట్టణంలో ఆదివారం(నేడు) టిడిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలో మండల వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని మండల కన్వీనర్ సోమశేఖర్ పిలుపునిచ్చారు. దీక్షలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొంటారని తెలిపారు.

ధర్మవరం టౌన్ : చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి సిఎం జగన్‌తో పాటు వైసిపి నాయకులు పైశాచికానందం పొందుతున్నారని టిడిపి నాయకులు ధ్వజమెత్తారు. రిలే నిరాహార దీక్షలో నాయకులు ఫణికుమార్, గరుగు వెంగప్ప, నాగూర్‌హుస్సేన్, కేశగాళ్ల శీన, గంగారపు రవి, అత్తరహింబాషా, గోసల శ్రీరాము లు, వెంకటేశ్వర్లు, గోపాల్ కుర్చున్నారు. వీరికి న్యాయవాదులు, రైతుసంఘం నాయకులు జేవీ రమణ, ముత్యాల ప్ప, రామ్మోహన్‌రావు సంంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాంపురం శీన, అంబటిసనత్, ఓంకార్, కొత్తపేట ఆది, రేగాటిపల్లి వరదాజులు, శ్రీనివాసులురాజు, రేనాటిశీన, బిల్లేశీన, సాకే కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలిలో టిడిపి ఆధ్వర్యంలో పెద్దఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎద్దుల రాముడు, కిషోర్, పండు, సిపిఐ నాయకులు ఈశ్వరయ్య, అశోక్, మస్తాన్, పాల్గొన్నారు.

నియంతపై పోరాటానికి సిద్ధం

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని ప్రధాన రహదారిలో గోపురం రెండవ వీధిలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో మేము సైతం బాబు కోసం ప్ల కార్డులు ప్రదర్శిస్తూ మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఆది మాట్లాడుతూ బాబు పర్యటనలకు, లోకేష్ పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన చూసి ఓర్వలేక తప్పుడు కేసులు బనాయించారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున గుప్త, బేకరీ నాయుడు, హరినాథ్ చౌదరి, మూర్తి, ఆది కేశవులనాయుడు, బుడ్డప్ప, రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరులో రిలే దీక్షలో పాల్గొన్న టిడిపి నాయకులు,

గాండ్లపెంటలో దీక్షలో పాల్గొన్న కందికుంట వెంకటప్రసాద్,

పెనుకొండలో మాట్లాడుతున్న సవితమ్మ,

పుట్టపర్తిలోమోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న టిడిపి శ్రేణులు

చంద్రబాబు విడుదలయ్యేంత వరకూ పోరాటం

గుండుమల తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి అధినేత చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చేంత వరకూ పోరాటం ఆగదని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి స్పష్టం చేశారు. 'నేను సైతం బాబు కోసం' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ఆసుపత్రి ఎదురు గా రిలే నిరాహారదీక్ష చేపట్టారు. గుండుమల మాట్లా డుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో చంద్రబా బు ఎలాంటి తప్పిదం చేయలేదన్నారు. ఎందరో నిరుద్యోగులకు వృత్తి, విద్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించగా ఈ సైకో ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టిందన్నారు. దీక్షకు కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వ రనాయుడు, జనసేన నాయకు లు మద్దతు తెలిపారు. దీక్షలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, అగళి జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్ కుమార్‌స్వామి, శివకుమార్, బుడ్డన్న, కోడిపల్లి సర్పంచి నరసింహమూర్తి, ఎంపిటిసి చంద్రప్ప, శ్రీనివాస్, జయన్న, బసవరాజు, నరసింహప్ప, తిప్పేస్వామి, భక్తర్, మంజునాథ్, శివలింగప్ప, రవికుమార్, కృష్ణారెడ్డి, దినేష్, ముకుంద, గంగాధర్, నాగరాజు, అల్లిఖాన్, సౌకత్, రామచంద్రారెడ్డి, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

తెలుగు యువత ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి-తనకల్లు

చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సంఘీభావంగా శనివారం తనకల్లులో మండల తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో యువకులు కొక్కంటి క్రాస్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందికుంట సూచనలతో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడానికి శక్తి వంఛన లేకుండా ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, నియోజకవర్గ పరిశీల కులు హరిప్రసాద్, సీనియర్ మహిళా నాయకురాళ్లు పర్వీన్‌బాను, కదిరి పట్టణ మాజీ అధ్యక్షుడు అహ్మద్‌అలీ, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, మాజీ కన్వీనర్లు శంకర్‌నాయుడు, రాజారెడ్డి, ఏమేనాయక్ తండా సర్పంచి మూడే కాంతమ్మ, నాగభూషణ, సీనియర్ నాయకులు దేశాయి విధురశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు, జడ్పిటిసిలు, మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు, తెలుగు మహిళా నాయకురాలు, ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీ నాయకులు, వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

తనకల్లులో టిడిపి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

'శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల్లో పని చేసే కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, కార్మికుల పట్ల గుత్తేదారుల వైఖరిని నిరసిస్తూ శనివారం పట్టనంలో సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, పట్టణ కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో పుట్టపర్తి ఎంపిడిఒ, తహశీల్దార్, పోలీస్ స్టేషన్, ఆర్‌డిఒ కార్యాలయం, కలెక్టరేట్, యనమలపల్లి, ప్రశాంతిగ్రామ్, పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో ప్రజలు, కార్మికులు, ఉద్యోగులకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ మడకశిర డివిజన్‌లో 15 నెలల పిఎఫ్, ప్రతినెలా కార్మికుల నుంచి కొల్లగొడుతున్న రూ. 2500 వెంటనే చెల్లించాలన్నారు. ఎస్-ఎస్ఆర్ కూలి రేట్లు అమలు చేయాలన్నారు. హిందూపురం డివిజన్‌లో 18 నెలల పిఎఫ్, 5 నెల ల వేతన బకాయిలు, కోత విధించిన రూ. 2500 సొమ్మును కాంట్రాక్టర్ గోవర్ధనరెడ్డి వెంటనే కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. మడకశిర డివిజన్‌లో ఎల్‌కె నాయుడు 120 బోగస్ పేర్లతో 18 నెలలుగా తీసుకున్న బిల్లులు రూ. 3.24 కోట్ల ప్రభుత్వ సొమ్మును వెంటనే రికవరీ చేయాలని కోరారు. వీటిపై త్వరలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పక్షాన నిలబడాల్సిన అధికారులు గుత్తేదారులకు అనుకూలంగా పని చేస్తుండడం విడ్డూరంగా ఉందని వారు తెలిపారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎస్ రద్దుకు ఎస్‌టియు డిమాండ్

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిపిఎస్‌ను రద్దు చేయాలని ఎస్‌టియు జిల్లా నాయకుడు టి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులను అవమానపరచడం, హేళనగా మాట్లాడడం, 117 జిఒను బలవంతంగా రుద్దడం తగదన్నారు. ఇలాంటి చర్యలపై కొన్ని ఉపాధ్యాయ సంఘాలు పోరాడుతుండగా మరికొన్ని ప్రభుత్వానికి అమ్ముడు పోయాయని మండిపడ్డారు. జిపిఎస్ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఆశయాల సాధనకు ఉపాధ్యాయ సంఘాలన్నీ ఏకమై ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యా యులు అబ్దుల్‌రెహ్మాన్, జగదీశ్వర్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు కె.వెంకటేష్, బి.నాగరాజు, కె.గోపిలను సన్మానించారు. రాష్ట్ర కౌన్సిలర్‌గా కోనంకి చంద్రశేఖర్ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్‌టియు సీనియర్ నాయకులు తిప్పన్న, కరియన్న, సంపత్, రవిచంద్ర, వెంగమనాయుడు, క్రిష్టప్ప, సుధాకర్, హరిప్రసాద్, మోతిలాల్, రామాంజనేయులు, అనిల్‌కుమార్, భాస్కర్, వెంకటరమణనాయక్, భక్తవత్సలనాయు డు, శ్రీధర్, జనార్ధన్, సూరి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

పోలీసు శాఖలో స్పెషల్ బ్రాంచ్ కీలకమైంది : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీసు శాఖలో స్పెషల్ బ్రాంచ్ ఎంతో కీలకమైందని, పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం ఏర్పడేలా విధులు నిర్వర్తించాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం జిల్లా పోలీస్ స్పెషల్ బ్రాంచి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది సమాచార సేకరణలో అప్రమత్తంగా ఉంటూ, నిరంతరం విధులు నిర్వహిస్తున్న ప్రాంతాల్లోనే సంచరిస్తూ పక్కా సమాచారం సేకరించాలన్నారు. ఏదైనా అసంఘటిత కార్యక్రమాలు జరిగినపుడు అందుకు గల ములాలను సంఘటన జరగక ముందే పసిగట్టా లన్నారు. ఎవరైనా సమాచారాన్ని చేరవేయకపోయినా, ఉద్దేశపూర్వకంగానే సరైన సమాచారాన్ని తెలియపరచకపోయినా, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించబోమ ని హెచ్చరించారు. ప్రధానంగా గొడవలు, ఈవ్ టీజింగ్, పబ్లిక్‌లో రౌడీ మూకలపై దృష్టి పెట్టాలన్నారు. సోషల్ మీడియాలో సమాజానికి హానికరమైన పోస్టులు పెట్టే వారిపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తు న్న తరుణంలో అప్రమత్తంగా ఉంటూ, అవాంఛనీయ సంఘటనలు జరగకముందే సమాచారాన్ని చేరవేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుడిబండ

సిఎం జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని మోపురుగుండుకు గిరన్నపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారు లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో దాదాపు 80 శాతం ఇప్పటికే నెరవేర్చారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. అభివృద్ధి, పాలనలో జగన్ ఇతర రాష్ట్రాల సిఎంలకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రాధమ్మ, జడ్పిటిసి భూతరాజు, సింగిల్‌విండో అధ్యక్షులు చంద్రప్ప, రాష్ట్ర వక్కలిగ ఛైర్‌పర్సన్ నళిని, పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ

కొత్తచెరువు : కొత్తచెరువు నూతన ఎస్ఐగా సురేష్‌బాబు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ లింగన్న విఆర్‌కు బదిలీ అయ్యారు. విడపనకల్లు మండలంలో పని చేస్తున్న సురేష్‌బాబు ఇక్కడికి బదిలీపై వచ్చారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయన్ను మండల వైసిపి నాయకులు కలిసి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, వాల్మీకి శంకర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ లింగన్న

పుట్టపర్తి ఎంపిడిఒగా నాగేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి రెగ్యులర్ ఎంపిడిఒగా నాగేశ్వరరెడ్డి శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అశోక్‌కుమార్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు ఇఒఆర్‌డిగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎంపిడిఒకు ఇఒఆర్‌డి అశోక్ కుమార్ రెడ్డి, ఎఒ రమణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ఇంజినీర్ శశికుమార్, రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు, రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు. అంతకుమునుపు ఎంపిడిఒ ఎంపిపి ఎవి రమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

డ్రెయినేజీ పనుల నాణ్యత పరిశీలన

అమరాపురం : మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామం బిసి, ఎస్సి కాలనీల్లో జడ్పీ నిధులు రూ. 15 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ పనుల నాణ్యతను శనివారం క్వాలిటీ కంట్రోల్ డిఇ సురేష్‌బాబు పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మనునాయక్, జెఇ లక్ష్మీనారాయణ, జడ్పిటిసి సభ్యులు స్వారక్క నరసింహమూర్తి, సర్పంచి ఈరన్న, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మండల కాపు సంక్షేమ సేన అధ్యక్షునిగా అశోక్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మండల కాపు సంక్షేమ సేన అధ్యక్షునిగా కావేటి అశోక్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కాపు సంక్షేమ సేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పేరూరు శ్రీనివాసులు, ఉమ్మడి అనంతపురం జిల్లా కోఆర్డినేటర్ గ్రంధి దివాకర్ ఆధ్వర్యంలో ముదిగుబ్బ మండల బలిజ పెద్దల సమక్షంలో సమావేవం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ బలిజ సంఘం అభివృద్ధికి తన వంతు కషి చేస్తానని తెలిపారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పాత పెన్సన్ విధానాన్ని(ఒపిఎస్) పునరుద్ధరించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమా ర్, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బికె ముత్యాలప్ప డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఒ హోం కార్యాలయంలో శనివారం ఎపిటిఎఫ్ మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేటికీ రద్దు చేయకపోవడం అన్యాయమన్నారు. ఉపాధ్యాయులకు తీవ్ర విఘాతం కలించే జిఒ-117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 30న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సానే రవీంద్రారెడ్డి పాల్గొన్నారు. అనంతరం పట్టణ, మండల నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. పట్టణ అధ్యక్షుడిగా నీలూరు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడిగా నాగప్ప, ప్రధాన కార్యదర్శిగా వడ్డే జగదీశ్, జిల్లా కౌన్సిలర్లు, ఉపాధ్యక్షులను ఎంపికచేశారు. మండల అధ్యక్షుడిగా ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా శివానంద, ఉపాధ్యక్షులు, కౌన్సిలర్లను ఎంపికచేశారు.

మట్టి గణపయ్యలు, ఓజోన్ డేపై అవగాహన

ప్రజాశక్తి-అగళి

మట్టి వినాయకుని ప్రతిమలు, ఓజోన్ దినోత్సవం గురించి శనివారం స్థానిక జడ్పి హైస్కూల్‌లో విద్యార్థు లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం వరదరాజులు మాట్లాడుతూ విద్యార్థులు మట్టి వినాయకు ని ప్రతిమలను తయారు చేసి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను అగళి పురవీధుల్లో ప్రదర్శించడంతో పాటు మట్టి విగ్రహాల వల్ల కలిగే ఉపయోగాలను నినాదాల ద్వారా ప్రజలకు వివరించారు. ఓజోన్ పొర ప్రాధాన్యతను తెలిపే నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దం : మండల పరిధిలోని సానిపల్లి ఎంపియుపి పాఠశాలలో శనివారం అంతర్జాతీయ ఓజోన్ డే ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం చంద్రశేఖర్‌గౌడ్ సమక్షంలో సైన్స్ ఉపాధ్యాయులు నారాయణస్వామి, లక్ష్మినరసమ్మ మాట్లాడుతూ సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల నుంచి ఓజోన్ పొర భూమిని ఏవిధంగా కాపాడుతుందో విద్యార్థులకు వివరించారు. చెట్లను పెంచడం ద్వారా ఓజోన్ పొరను పరిరక్షించవచ్చు ని, కాలుష్య కారకాలను తగ్గించాలని సూచించారు. విద్యార్థులను 'ఓ' ఆకారంలో కూర్చోబెట్టి అవగాహన కల్పించా రు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణానాయక్, మోహన్‌రెడ్డి, సత్యం, జయమ్మ, లక్ష్మినారాయణ, మహబూబ్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-కదిరి టౌన్

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మమత సూచించారు. పట్టణంలోని అంగన్వాడీ సెంటర్లలో శనివారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహం చేయరాదన్నారు. బాల్య వివాహం చేస్తే రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 1 లక్ష జరిమానా విధిస్తారన్నారు. పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మానవ అక్రమ రవాణా, వ్యక్తిగత పరిశుభ్రత, రక్త హీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ఐటి వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కురుబ మారుతి

హిందూపురం : వైసిపి ఐటీ వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా హిందూపురం రూరల్ మండలం గొల్లపురం గ్రామానికి చెందిన కురుబ మారుతి నియమితులయ్యారు. తన నియామకానికి సహరించిన వైసిపి నాయ కులు వేణు రెడ్డిని కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటిపి హనుమంత రెడ్డి, జడ్పిటిసి బాణాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు, గోలపురం సర్పంచి దేవరాజు, నాయకులు తిప్పేరుద్రయ్య, రాచపల్లి మహేంద్రనాథ్ రెడ్డి, కిరికెర వైస్ సర్పంచి నరేంద్ర, చంద్రప్ప, అనిల్ కుమార్, అరుణ్ కుమార్, రఘు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణకు ఘన సన్మానం

పెనుకొండ : వరల్డ్ లా డే సందర్భంగా శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద హైకోర్టు న్యాయవాది, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివరామకృష్ణను ఆల్ కౌసర్ సేవా సంస్థ అధ్యక్షులు అహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు షమీవు ల్లా, మైనార్టీ నాయకులు పెప్సీ నిసార్, మారుతిప్రసాద్, ఎంఐఎఫ్ నాయకులు శ్రీనివాసులు, హనుమంతు, గోవిందు, బహుజన చైతన్య వేదిక నాయకులు వెంకటేష్, రవికుమార్, కౌన్సిలర్ శేషాద్రి, మారుతి, ముత్యాలు, నారాయణ, నాగరాజు, ఆర్.రామాంజనేయులు, మునిమడుగు నరసింహులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-చిలమత్తూరు

పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక పేర్కొన్నారు. మండల పరిధిలోని వీరాపురం, వెంకటాపురం గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు, ప్రతి కుటుంబానికి చేకూరే లబ్ధి గురించి వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించే వైసిపిని మరోమారు ఆదరించాలని కోరారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా ఉన్న వీరాపురం పక్షుల కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పురుషోత్తమరెడ్డి, సర్పంచి లక్ష్మిపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని డబురువారిపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉపాధ్యాయుడు కె.నాగరాజు కుమారుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న కే.సాయివినయ్ జన్మదినం సందర్భంగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీలర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట రంగారెడ్డి, మంజుండప్ప, ఉపాధ్యాయులు నాగరాజు, చంద్రమౌళి, రాజు, రాధ, నరసింహులు, మణిమాల, తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో ఐదుగురు అరెస్టు

ధర్మవరం టౌన్ : స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద ఈ నెల 8వ తేదీ జరిగిన శ్రీనివాసులు హత్యకేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్టు వన్ టౌన్ స్టేషన్‌లో సిఐ సుబ్రమణ్యం శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. హత్య కేసుపై మూడు బందాలతో విచారణ చేపట్టామన్నారు. ధర్మవరం మండలం లోని బడన్నపల్లి గ్రామానికి చెందిన కపాడం రామ్మోహన్, గంగాధర్, శివయ్య, ధర్మవరం పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కమతం సంగాలప్ప, చెన్నేకొత్తపల్లి మండలంలోని వెల్దుర్తికి చెందిన శ్రీనివాసులుతో హతుడు శ్రీనివాసులు ఆటో స్టాండ్‌లో ఆటో పార్కింగ్ విషయంలో తరచూ గొడవ పడేవాడన్నారు. ఈ క్రమంలో ఆ ఐదుగురు పథకం ప్రకారం శ్రీనివాసులను ఆటోలో ఎక్కించుకుని బడన్నపల్లి సమీపంలోకి తీసుకెళ్లి మద్యం తాగించి ఆపై కర్ర, ఇనుప రాడ్లతో తలపై బాది హత్య చేశారన్నారు. సాక్ష్యాలు లభించకుండా శవాన్ని ఆటోలో తీసుకొచ్చి రైల్వేస్టేషన్ రోడ్డు పక్కన మట్టిదిబ్బలో పడేశారన్నారు. నిందితులు బడన్నపల్లి విఆర్ఒ విష్ణు వద్ద లొంగిపోయి హత్య చేసినట్టు అంగీకరించారన్నారు. కేసును ఛేదించడానికి కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, సిబ్బంది నగేష్, శ్రీనివాసులు, భాస్కర్, అంజి, ఆనంద్‌లకు సిఐ రివార్డు అందజేశారు.

ఆశా కార్యకర్తకు పాముకాటు

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని భుగానపల్లి గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కళావతి(39) పాముకాటుకు గురైంది. వైద్యులు తెలిపిన వివరాల మేరకు... ఆశా కార్యకర్త తన పొలంలో వేరుశనగ మొక్కలు తొలగిస్తుండగా పాము కరవడంతో వెంటనే గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సిఫారసు చేసినట్టు వెల్లడించారు.

In the court of the IV Addl. District Judge, Ananthapuramu
E.P.No:607/2021 in A.A.No: 451/2019
Between:
M/s.Shriram Transport Finance Company Ltd, Kadiri Rep by its Authorised Signatory and General Power of Attorney Holder Mr.Y.Rami Reddy ...**Decree Holder**
And
Najir Khan Patan and others
...**Judgment Debtors**
Notice to JDR No.2
To
J.Dr No:2: K.Adi Murthy S/o K. Venkata swamy, H.No:6-71-A, Nandigani Palli Village, Kondavenkatapalli Post, Tanakal Mandal, Sri Saty Sai District.
పై నెంబరు కేసులో జె.డి.ఆర్:2 అయిన మీ హాజరు నిమిత్తం 22/09/2023వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలపుకొనవలెను.లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
ఎ.చెన్నప్ప
అడ్వకేట్, అనంతపురం సెల్:9618787219